
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 28 జనవరి 2025





ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిచ్చేలా..

- నేడు 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'
- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు
- పాల్గొనున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఎమ్మెల్యే గొండు శంకర్, కార్పొరేషన్ కమిషనర్, అధికారులు కూడా..
- శ్రీకాకుళం నగర పరిధి 31వ డివిజన్‌లో చర్చావేదిక

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

శ్రీకాకుళం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిచ్చేలా.. ప్రజాప్రతినిధులకు, ప్రజలకు మధ్య వారధిలా నిలిచేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' పేరుతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను.. సామాజిక సమస్యలను వార్తలుగా ప్రచురించి.. ఆయా సమస్యలను పరిష్కార దిశగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లనుంది. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో సాయి నగర్ కాలనీ, పట్నాయక్ కాలనీ, దండి వీధి ప్రజల సమస్యలను వివరించేందుకుగాను మంగళవారం ఈ కార్యక్రమం జరుగనుంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధులకు విన్నవించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం.. తీసుకోవాల్సిన చర్యల గురించి వెల్లడించేందుకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సమక్షంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావుతోపాటు కీలక అధికారులు కూడా పాల్గొనున్నారు. డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



నేడు శంబరలో సిరిమానోత్సవం
6లో



అధ్వానంగా తేలినీలాపురం విడిది కేంద్రం

ఇటు పక్షులకు.. అటు సమస్యలకు.. విడిది

- తేలినీలాపురంలో పర్యాటకులకు ఇబ్బందులు
- మూలకు చేరిన వస్తువులు
- కన్జర్వేటివ్ రిజర్వ్‌గా మార్చేందుకు ప్రయత్నాలు

6లో

రాకపోకలకు ఒకేలా రుసుం

- కంగుతింటున్న వాహనదారులు
- ఇదీ మడపాం టోల్‌ప్లాజా వద్ద పరిస్థితి

8లో



సుదూర తీరం.. అయినా వలసలే!



గుజరాత్‌లో సిక్కోలు మత్స్యకారులు



- రాష్ట్రంలో 978 కి.మీ. పొడవునా..
- మత్స్యకారులకు గిట్టుబాటుకాని వేట
- ముందస్తు ఒప్పందంతో గుజరాత్‌కు..
- ప్రమాదాలు జరిగితే మృత్యువాతే..

సిక్కోలు.. వలసల జిల్లాగా పేరొందింది. జిల్లాలో సుదూర తీర ప్రాంతం ఉన్నా.. చేపలవేటకు అనుకూల పరిస్థితులు లేక మత్స్యకారులకు ఉపాధి కరువవుతోంది. ఫలితంగా గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. ఏడాదిలో సుమారు 9 నెలలుపాటు కుటుంబాలకు దూరంగా.. ఇతర ప్రాంతాల్లోనూ ఉంటూ పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా జీవన పోరాటం సాగిస్తూనే ఉన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతుండడంతో ఇకనైనా తమ బతుకులు మారతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎచ్చెర్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ తీర ప్రాంతం విస్తరించి ఉంది. తీరం వెంబడి వందలాది గ్రామాల్లో లక్షలాది మంది మత్స్యకారులు దశాబ్దాలుగా వేట సాగిస్తున్నా.. స్థానికంగా గిట్టుబాటు కావడం లేదు. జెట్టీలు, హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, కోల్డ్‌స్టోరేజీలు లేక చేపల వేట సక్రమంగా సాగడం లేదు. దీంతో ఏటా మత్స్యకారులు ఉపాధి కోసం గుజరాత్ రాష్ట్రంలోని వీరావల్, కాండ్లా, పోరుబందర్‌తో పాటు కర్ణాటకలోని మంగుళూరు తదితర ప్రాంతాలకు వలస పోతున్నారు. ఏడాదిలో సుమారు 9 నెలలపాటు భార్యాబిడ్డలను విడిచి కుటుంబాలకు దూరంగా ఉంటూ.. ఇతర ప్రాంతాల్లోనే చేపల వేట సాగిస్తున్నారు. ఏటా జూలై, ఆగస్టులో వలస వెళ్లి.. ఏప్రిల్‌లో స్వగ్రామాలకు చేరుకుంటారు. కాగా, జిల్లా మత్స్యకారులు గుజరాత్‌లో ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. వీరావల్‌లోని అరేబియా సముద్రంలో చేపల వేట సాగిస్తూ.. ఈ ప్రాంత మత్స్యకారులు పొరపాటున బోర్డర్ దాటి పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 2018 నవంబరులో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 22మంది మత్స్యకారులు పాక్ కోస్టుగార్డులకు బందీలుగా చిక్కారు. ఏడాదిన్నర తర్వాత విడుదలయ్యారు. అంతకు ముందు ఇలాంటి సంఘటనలున్నాయి. దీంతో కొంతమంది మత్స్యకారులు కర్ణాటకకు వలసలు ప్రారంభించారు.

కారణాలెన్నో

మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులే వలసలకు ప్రధాన కారణం. జిల్లాలో మత్స్యకారులు సంప్రదాయ తెప్పలతో, మోటారు బోట్లతో వేట సాగిస్తున్నారు. ఐదారుగురు చేపల వేటకు వెళితే కనీస ఖర్చులు కూడా రావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. అలాగే ఆడపిల్లల పెళ్లిళ్లు చేసేందుకు డబ్బులు లేక అప్పుల పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. సొంతిల్లు కట్టుకోలేకపోతున్నామని పేర్కొంటున్నారు. స్థానికంగా వేట సాగిస్తే.. ఇబ్బందులు తప్పడం లేదని (మిగతా 6వ పేజీలో..)

పరిశ్రమలు లేక..

- ఉపాధి కోసం యువత వలస బాట

వజ్రపుకొత్తూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలు కూడా ఆశించినస్థాయిలో లేకపోవడంతో యువతకు ఉపాధి కరువవుతోంది. ఈ క్రమంలో ఉపాధి కోసం వలసబాట పడుతున్న యువత సంఖ్య పెరుగుతోంది. ఏటా జిల్లా నుంచి సుమారు 2 లక్షల మంది వలసబాట పడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎచ్చెర్ల, రణస్థలం ప్రాంతాలు తప్పితే.. మిగిలిన మండలాల్లో పెద్దగా పరిశ్రమలు లేవు. పలాస నియోజకవర్గంలో జీడిపరిశ్రమలు కొంతమేరకు ఉపాధి కల్పిస్తున్నాయి. కానీ ఏడాది పొడవునా పనులు ఉండవు. అలాగే చదువుకున్న వారికి ఈ పరిశ్రమల్లో ఉపాధి లభించడం లేదు. జిల్లాలో పరిశ్రమలు (మిగతా 6వ పేజీలో..)



పలాస స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న వలస జీవులు (ఫైల్)

సమాచారం

జిల్లాకు మరో 16 మద్యం దుకాణాలు

- గీత కార్మికులకు కేటాయింపు
- దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10శాతం మద్యం దుకాణాలు కేటాయించింది. ఈ మేరకు జిల్లాకు సంబంధించి అదనంగా 16 మద్యం దుకాణాలను 50శాతం రాయితీతో కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తిరుపతి నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గీత కార్మికుల్లోని సెగిడి, శ్రీశయన, గౌడ, యాత వర్గాలు వారు ఈ దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి. సెగిడిలకు శ్రీకాకుళం కార్పొరేషన్‌తోపాటు కొత్తూరు, టెక్కలి, కంచిలిలో ఒక్కో దుకాణం కేటాయించింది. శ్రీశయనలకు ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పోలాకి, పాతపట్నం, నందిగాం, వజ్రపుకొత్తూరు, మందస, ఇచ్ఛాపురం, కవిటిలో ఒక్కో షాపు కేటాయించింది. హిరమండలంలో యాతలకు, ఇచ్ఛాపురం రూరల్‌లో గౌడలకు ఒక్కో దుకాణం కేటాయించింది. జిల్లావాసులు మాత్రమే వీటికి దరఖాస్తు చేసుకోవాలి. రూ.2లక్షలు చొప్పున చలానా తీసి.. ఫిబ్రవరి 5లోగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలి' జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తిరుపతి నాయుడు సూచించారు. ఫిబ్రవరి 7న డ్రా తీస్తామని వెల్లడించారు.

నేడు జిల్లాకు డీజీపీ రాక

శ్రీకాకుళం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): డీజీపీ, ఆర్‌అండ్‌బీ శాఖ ఎమ్‌డీ సీహెచ్ ద్వారక తిరుమల మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తోపాటు జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన సందర్శించనున్నారు. ఆర్టీసీ అధికారులతో ఉదయం సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

ఆదిత్యుడి వైభవాన్ని చాటుదాం

- సూర్యనమస్కారాలతో రథసప్తమి వేడుకలకు శ్రీకారం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం. ఆదిత్యుడి వైభవాన్ని నలుదిశలా చాటి చెబుదామ'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. సోమవారం అనివెట్టి మండపంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి.. 108 మందితో సూర్య నమస్కారాలను సాధన చేయించారు. కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్య నమస్కారాల సాధనతో రథసప్తమి వేడుకలకు శ్రీకారం చుట్టినట్టయిందన్నారు. 'ఫిబ్రవరి 2న 80 అడుగుల రోడ్డులో 5వేల మందితో సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నాం. అలాగే రాష్ట్రస్థాయి వాలీబాల్, గ్రామీణ క్రీడలైన కర్రసాము, సంగిడీలు, ధాన్యం సంచులు ఎత్తడం, వెయిట్ లిఫ్టింగ్ తదితర జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తాం. కోలాటం, తప్పెట గుళ్లు, చెంచు భాగోతం, చెక్కభజన, తూర్పు భాగవతం, తాలింఖానా, నాదస్వరం, పెద్దపాడు డప్పు వాయిద్యం, గిరిజనుల థింసా నృత్యం, నేలవేషాలు వంటి కార్యక్రమాలు ఉంటాయి. తొలిసారిగా హెలీకాప్టర్ ద్వారా టూరిజం సర్క్యూట్ అవకాశం వంటి వినోదాత్మక ఏర్పాట్లు చేస్తున్నామ'ని తెలిపారు. సిక్కోలు ఆధ్యాత్మిక చరిత్రలో ఒక కలికితురాయిగా ఈ కార్యక్రమం నిలిచిపోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవో సాయిప్రత్యూష, డీపీవో భారతీ సౌజన్య, ఆయుష్ సీనియర్ వైద్యాధికారి, కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ జగదీష్, ముఖ్య ప్రణాళికాధికారి లక్ష్మీప్రసన్న, ఉపాధి అధికారి సుధ, వికలాంగుల శాఖ ఏడీ కవిత పాల్గొన్నారు.



సూర్య నమస్కారాలు సాధన చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ, ఎమ్మెల్యే తదితరులు



శిథిలావస్థలో ఉన్న దబ్బగూడ పాఠశాల భవనం

మెళియాపుట్టి మండలంలో దబ్బగూడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిధులు లేక భవనానికి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం ఆ గ్రామంలోని గిరిజన కమ్యూనిటీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో ఇటువంటి పాఠశాలలను మెరుగుపరిచేందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు మేరకు కేంద్రం నిధులు మంజూరు చేయనుంది. ఐటీడీఏ పరిధిలో విద్య, వైద్య సదుపాయాలతోపాటు గిరిజనుల పంటలకు గిట్టుబాటు కల్పించేలా మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలను ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతోంది.



గిరిజన కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్న పాఠశాల

గిరిజన ప్రగతికి బాటలు

- ఐటీడీఏకు నిధులు మంజూరు చేయనున్న కేంద్రం
- మెరుగుపడనున్న విద్య, వైద్య సదుపాయాలు
- మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

మెళియాపుట్టి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గిరిజన గూడలు ప్రగతి బాట పట్టనున్నాయి. ఈ గ్రామాల్లో విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపడనున్నాయి. అటవీ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలు కూడా ఏర్పాటు కానున్నాయి. వీటికోసం కేంద్ర ప్రభుత్వం ధరి ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్(పీఎంజుగా) కింద ఐటీడీఏలకు నిధులు విడుదల చేయనుంది. దీంతో తమ బతుకులు మారనున్నాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 మండలాలు (శ్రీకాకుళం - 16, పార్వతీపురం 4) ఉన్నాయి. వీటి పరిధిలో 1,239 గిరిజన గ్రామాలు ఉన్నాయి. మొత్తం 48,142 కుటుంబాలు, 1,66,118 మంది జనాభా నివసిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన సబ్‌ప్లాన్ నిధులను వివిధ కార్పొరేషన్లకు మళ్లించింది. దీంతో ఐటీడీఏలో నిధులు లేక గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. గత ఐదేళ్లలో గిరిజన పాఠశాలలకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ఫలితంగా జీపీఎస్, మండల పరిషత్ పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. దీంతో పంచాయతీ భవనాలు, పాఠశాలల వరండాల్లో విద్యార్థుల కు బోధన సాగించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గిరిజన గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గిరిజ నులను ఆర్థికంగా ముందుకు తీసుకురావడానికి అవరమైన నిధులు మంజూరు చేయా లని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనికి కేంద్రం పచ్చజెండా ఊపడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.430 కోట్ల నిధులు..

- గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం సీతంపేట ఐటీడీఏకు

- (మిగతా 6వ పేజీలో..)




కనీస వసతులకు నోచుకోని ఏజెన్సీలో వారపు సంత

దీక్షతో నేర్చి.. ప్రావీణ్యంతో మెరిసి!

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు, అవార్డులు
- వందల్లో శిష్యగణం
- ఇదీ రఘుపాత్రుని శ్రీకాంత్ ప్రత్యేకత


రఘుపాత్రుని శ్రీకాంత్


చంద్రబాబు నుంచి సత్కారం


పురస్కారాలతో..

గుజరాతీపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కూచిపూడి, భరతనాట్యంలో వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ ఇచ్చి... శ్రీకాకుళం జిల్లా కీర్తిని దేశ విదేశాల్లో వ్యాపింపజేస్తున్న వ్యక్తి రఘుపాత్రుని శ్రీకాంత్. చిరుప్రాయంలోనే నాట్యంపై మక్కువ పెంచుకున్న ఆయన అకుంఠిత దీక్షతో నేర్చుకున్నారు. 1990లో ట్రెడిషనల్ డ్యాన్స్ స్కూలును స్థాపించారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలో శివశ్రీ నృత్య నికేతన్‌ను స్థాపించి... కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. పేద విద్యార్థులకు ఉచితంగా నాట్యం నేర్పిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో వందలాది ప్రదర్శనలను ఇస్తూ... అక్కడి నేతలు, అధికారులు, ముఖ్యమంత్రులతో ప్రశంసలను అందుకుంటున్నారు.


నాట్యం నేర్పిస్తున్న శ్రీకాంత్

ప్రధాని అభినందన

2021లో 'వందేభారతం' పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది శ్రీకాంత్ బృందం. శివశ్రీ నృత్య నికేతన్ బృందానికి 2022లో ఢిల్లీ రాజ్‌పథ్‌లో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. అదే బృందానికి కేంద్ర ప్రభుత్వం సొంత ఖర్చులతో యు.ఎస్.ఎ.లోని తెలుగువారిని అలరింపజేసేందుకు 16 రాష్ట్రాలలో ప్రదర్శనలు ఇప్పించడం విశేషం. సింగపూర్, యు.ఎస్.ఎ., ఆస్ట్రేలియా, పోలాండ్ వంటి దేశాల్లో ఆయన శిష్యగణం ఉన్నారంటే శ్రీకాంత్ ప్రతిభను అర్థం చేసుకోవచ్చు.

ఎన్నో ప్రశంసలు

నృత్యంలో రఘుపాత్రుని శ్రీకాంత్ డాక్టరేట్ అందుకున్నారు. ఆయన శిష్యులలో అనేక మంది తమ ప్రతిభతో గుర్తింపు పొందుతున్నారు. జాతీయ స్థాయిలో ప్రదర్శనలతో ప్రశంసలు అందుకుంటున్నారు. మిలాన్-2022 పేరిట అంతర్జాతీయ నేవీ ఫీట్ సెలబ్రేషన్స్‌లోను, అసోం, కేరళ, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, హర్యానాల్లో జరిగిన జాతీయ యూత్ ఫెస్టివల్స్‌లోనూ తన శిష్య బృందంతో కలసి ప్రతిభ చూపించారు. నేపాల్, భూటాన్, డార్జిలింగ్, భోపాల్‌లలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. ఒడిశా రాష్ట్రంలోని 13 వేదికలపై ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు. భక్తి, దూరదర్శన్, తదితర చానల్స్‌లో కొరియోగ్రాఫర్‌గానూ శ్రీకాంత్ రాణిస్తున్నారు.

పురస్కారాలు

నృత్యంలో శ్రీకాంత్ చేసిన కృషికి అనేక పురస్కారాలు అందుకున్నారు. రూర్కెలాలో 'వేదవ్యాస్' అవార్డు అందుకున్నారు. తిరుపతిలోని అకాడమీ ఆఫ్ ఇండియన్ డ్యాన్స్ వారు 'నాట్య ప్రవీణ' అవార్డుతో సత్కరించారు. 'నాట్య బ్రహ్మ', 'గురుశ్రీ' వంటి వాటితో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.

మూగజీవాలపై ప్రేమతో...

మూగజీవాలంటే శ్రీకాంత్‌కు మక్కువనే చెప్పుకోవాలి. ఇంటి నుంచి బయటకు వెళితే.. దారి పొడవునా పిల్లులు, శునకాలు గుంపులుగా ఆయన దగ్గరకు చేరుతుంటాయి. ఇందిరా విజ్ఞాన్ భవన్, ఇల్లీసుపురం వద్ద గల శిక్షణ కేంద్రాల వద్ద వీధి శునకాలు వస్తుంటే.. అక్కున చేర్చుకుంటూ ఆయన తెచ్చుకున్న ఆహారాన్ని వేస్తుంటారు. కోవిడ్ సమయంలో వివిధ జంక్షన్లకు వెళ్లి మూగజీవాలకు ఆహారం అందించారు.

ఇటు పక్షులకు.. విడిది అటు సమస్యలకు..

- తేలినీలాపురంలో పర్యాటకులకు ఇబ్బందులు
- మూలకు చేరిన పిల్లల ఆట వస్తువులు
- అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈ ప్రాంతీయుల వేడుకోలు


విదేశీ విహంగాలు

టెక్కలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విదేశీ విహంగాల విడిది కేంద్రమైన తేలినీలాపురానికి సమస్యలు వెంటాడుతున్నాయి. వీటిని పరిష్కరించాల్సిన అటవీ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విదేశీ విహంగాలను చూసేందుకు వచ్చే వారికి ఇక్కడ మౌలిక సౌకర్యాలు కరువవడంతో సమయం గడిపేందుకు ఇష్టపడడం లేదు. సైబీరియా ప్రాంతం నుంచి వేలాది కిలోమీటర్లు ఎగురుతూ పెలికాన్, పెయింటెడ్‌స్టార్ పక్షులు ఏటా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వచ్చి తేలినీలాపురంలో గల చెట్ల పైకి చేరుకుంటాయి. ఈ పక్షులు ముందుగా గూళ్లు ఏర్పరుచుకొని ఆ తరువాత జతకట్టి.. గుడ్లు పొదుగుతాయి. పిల్లలు ఎగిరే స్థాయికి వచ్చిన తరువాత ఏప్రిల్ నెలలో తిరుగు ప్రయాణమవుతాయి. దశాబ్దాలుగా ఈ విదేశీ పక్షులు ఇక్కడికి వస్తున్నాయి. కేవలం తేలినీలాపురంలో గల చింత, తుమ్మ, గండ్ర, జూమ్ చెట్లుపైనే నివశిస్తుంటాయి. 1979 నుంచి అటవీ శాఖ తేలినీలాపురంలో గల విదేశీ పక్షుల సంరక్షణ బాధ్యతలను చేపట్టింది. వీటిని చూసేందుకు ఏటా పదివేల మందికి పైగా ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు.

అభివృద్ధికి దూరం

తేలినీలాపురంలో పక్షులు నివశిస్తున్న ప్రాంతానికి రక్షణ గోడ, రాకపోకల గేట్లు, చిల్డ్రన్స్ ప్లే జోన్ సౌకర్యాలు, కూర్చునేందుకు అవసరమైన బెంచీల సౌకర్యాలు లేవు. అలాగే ఎకరా 68సెంట్ల విస్తీర్ణం గల పక్షుల విడిది కేంద్రంలో మట్టి నింపి గోతులు పూడ్చాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతానికి అటవీశాఖ కన్జర్వేటివ్ రిజర్వ్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నా అది సాధ్యపడడం లేదు. ఈ స్థలం ఉప్పాడ భీమారావు, రేణంకి చిన్నఅప్పలస్వామి, రేణంకి పెద్దఅప్పలస్వామి, పాండ్రేటి వరహాలు, కొత్తమ్మకు చెందినదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ భూమి రికార్డులను అటవీ శాఖ కిందకు మార్చాలని అధికారులు కోరుతున్నా సాధ్యపడడం లేదు. ఇదిలా ఉండగా ఒక వాచ్‌మెన్‌కు ఏడాదిన్నరగా, మరో వాచ్‌మెన్‌కు ఆరు నెలలుగా జీతభత్యాలు లేని దుస్థితి నెలకొంది. విదేశీ విహంగాల విడిది కేంద్రమైన తేలినీలాపురం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాలంటే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టి సారించాల్సి ఉంది. ఈ ప్రాంతానికి సమీపంలో ఏర్పాటవుతున్న పోర్టు యంత్రాంగంతో సీఎస్ఆర్ యాక్టివిటీస్ కింద అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. అలాగే ప్రభుత్వం తరపున టూరిజం, అటవీ శాఖ నిధులు మంజూరు చేస్తే మౌలిక సదుపాయాలు కల్పించవచ్చు.


మూలకుచేరిన ఆట పరికరాలు

శిథిలావస్థలో వాచ్‌టవర్

విదేశీ పక్షులను తిలకించేందుకు అవసరమైన వాచ్‌టవర్‌ను 1999లో అప్పటి మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ ఏర్పాటు చేయించారు. ఆ టవర్ పెచ్చులూడి.. శిథిలావస్థకు చేరుకుంది. పది మందికి పైగా పర్యాటకులు దీని పైకి చేరితే... ఊగుతూ... కూలుతుందేమోననేలా భయపెడుతుంది. ఈ కేంద్రంలో పిల్లలు ఆడుకునేందుకు గతంలో ఏర్పాటు చేసిన రంగులరాట్నం, తోపుడు బల్లలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడికి వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పని చేయడం లేదు. ఈస్ట్‌కోస్ట్ థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో తేలినీలాపురం పక్షుల విహార కేంద్ర అభివృద్ధికి రూ.మూడు కోట్లు మంజూరు చేస్తున్నట్లు అప్పటి కలెక్టర్, జేసీ స్థాయి అధికారులు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఒకటి, రెండు గదులతో మమ అనిపించారు. ఆ తరువాత తేలినీలాపురం అభివృద్ధి ఊసే మరిచారు.


తేలినీలాపురం వాచ్‌టవర్

ఏడాదిన్నరగా జీతాలు లేవు



ఈ విదేశీ పక్షుల విహార కేంద్రంలో దశాబ్దాలుగా పని చేస్తున్నాను. నెలకు రూ.9,700 వంతున వేతనాన్ని గతంలో అటవీశాఖ అందించేది. గత ఏడాదిన్నరగా ఎటువంటి జీతభత్యాలు ఇవ్వడం లేదు. భార్యాబిడ్డలతో ఎలా బతకాలో తెలియని పరిస్థితి నెలకొంది. అటవీశాఖ అధికారులకు జీతభత్యాల కోసం ప్రశ్నిస్తే అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ఈ పక్షుల విడిది కేంద్రానికి నేను కూడా 60సెంట్ల స్థలం ఇచ్చాను.

- ఉప్పాడ భీమారావు, వాచ్‌మన్

సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించాలి

తేలినీలాపురం చుట్టూ అర కిలోమీటరు నుంచి కిలోమీటరు వరకు సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. కన్జర్వేటివ్ రిజర్వ్‌గా మార్చేందుకు ఈ స్థలాన్ని అటవీ శాఖకు రెవెన్యూ అధికారులు కేటాయించాలి. అప్పుడే అటవీ శాఖ నుంచి నిధులు మంజూరై కొంతమేరకు అభివృద్ధి చేసే అవకాశాలు ఉంటాయి.

- సంజీవరావు, అటవీశాఖ రేంజర్, టెక్కలి

పరిశ్రమలు లేక..

(మిగతా 6వ పేజీలో..)

విరివిగా ఏర్పాటు చేస్తే కొంతమేర వలసలు నివారించవచ్చు. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. అలాగే ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు, పోర్టులు లేక పోవడంతో మత్స్యకారులకు ఉపాధి దక్కడం లేదు. స్థానికంగా చేపలవేట ఆశాజనకంగా లేదు. మరోవైపు ఇసుక నేలలు కావడంతో తీరప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు కూడా చేపట్టడం లేదు. దీంతో గుజరాత్ తదితర రాష్ట్రాలకు వలస పోతున్నారు.

- వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో సుమారు 10వేల మంది జనాభా ఉన్నారు. ఇందులో సగానికిపైగా వలస బాట పట్టారు. శ్రీరామనవమి ఉత్సవాలు, సామూహిక పెళ్లిళ్ల సమయంలోనే గ్రామంలో జనాభా అధికంగా కనిపిస్తారు. అలాగే వజ్రపుకొత్తూరు మండలంలో 14 పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు చేపట్టడం లేదని ఇటీవల మండల సమావేశంలో ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు తెలిపారు. వలసల నివారణకు ఉపాధిహామీ పనులు అంతగా సహకరించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సహకరించాలి



పరిశ్రమల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి. జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు కాగా, దానికి కావాల్సిన భూములు ఇచ్చేందుకు కొంతమంది రైతులు ముందుకొస్తు న్నారు. ప్రతిపక్షాలు మాత్రం వారిలో భయాందోళన నింపుతున్నాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. తద్వారా యువత కు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- బి.శశిభూషణరావు, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు, వజ్రపుకొత్తూరు

కూటమి ప్రభుత్వంపైనే నమ్మకం



పరిశ్రమలు ఏర్పాటు ద్వారానే వలసలు నివారించవచ్చు. వజ్రపుకొత్తూరు మండలంలో వలసలు అధికంగా ఉన్నాయి. తీర ప్రాంతాల్లో పరిశ్రమల తోపాటు పోర్టులు కూడా నిర్మించాలి. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది.

- అంబటి రామకృష్ణ, మాజీ సర్పంచ్, డోకులపాడు

సుదూర తీరం.. అయినా వలసలే!

(ఐదో పేజీ తరువాయి)

వాపోతున్నారు. దీంతో వలసబాట పడుతున్నామని చెబుతున్నారు.

ముందస్తు అంగీకారంతోనే..

గుజరాత్‌లోని బోటు యజమానులతో ముందుగా ఒప్పందం కుదుర్చుకొని మత్స్యకారులు ఇక్కడి నుంచి బయలుదేరుతారు. సీజన్‌కు సుమారు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ బోటు డ్రైవర్‌తో యాజమానులు ఒప్పందం కుదుర్చుకుంటారు. ఒక్కో బోటులో 7 నుంచి 9 మంది వరకు వేటకు వెళ్తుంటారు. ఇందులో డ్రైవర్(గుజరాత్‌లో తండేలు అంటారు), అసిస్టెంట్ డ్రైవర్, కలాసీలు, వంట మనిషి(బండారి) ఉంటారు. సీనియర్ డ్రైవర్‌కు నెలకు రూ.35 వేలు, అసిస్టెంట్ డ్రైవర్‌కు రూ.20 వేల వరకు ఇస్తారు. కళాసీ, వంట మనిషికి రూ.12వేల నుంచి రూ.15వేలు చొప్పున చెల్లిస్తారు. చేపల వేట ఆశించిన స్థాయిలో సాగితేనే ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లిస్తారు.

మూత్ర విసర్జనకూ ఇబ్బందే

గుజరాత్‌లోని అరేబియా సముద్రంలో బోటుపై ఒకసారి బయలుదేరితే 20 నుంచి 25 రోజుల వరకు చేపలవేట సాగిస్తారు. బోటులో ఉన్నన్ని రోజులు స్నానం ఉండదు. దీని వల్ల చర్మవ్యాధులు సంక్రమిస్తాయి. పొరపాటున బోట్లు ఒకదానికొకటి ఢీకొని గాయాలపాలైనా, అనారోగ్యానికి గురైనా సరైన వైద్యం కూడా లభించదు. చేపల వేటలో ఉండగా మూత్ర విసర్జనకు కూడా ఇబ్బంది పడుతుంటారు. ఒడ్డుకు చేరిన తర్వాత కూడా ఒకటి రెండు రోజులు బోటులోనే విశ్రాంతి తీసుకోవాలి. ప్రత్యేకంగా వీరికి విశ్రాంతి గదులు ఉండవు. సముద్రంలో ఉండగా కొద్ది దూరం మాత్రమే మొబైల్ నెట్‌వర్క్ ఉంటుంది. ఆ తర్వాత పూర్తిగా వైర్‌లెస్‌పై ఆధారపడాలి.

వలసలు తప్పడం లేదు



పదో తరగతి చదివాను. ఈ ప్రాంతంలో చేపల వేట అనుకూలంగా లేదు. దీంతో సుమారు 18 ఏళ్లుగా గుజరాత్ రాష్ట్రానికి వలస వెళ్తున్నాను. వీరావల్‌లో అరేబియా సముద్రంలో చేపల వేట సాగించే బోటులో తొలుత కళాసీగా పనిచేశాను. గత 8 ఏళ్ల నుంచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. ప్రభుత్వం స్పందించి వలసల నివారణకు చర్యలు చేపట్టాలి.

- వారది మహందాత, బడివానిపేట

హార్బర్ నిర్మాణమైతేనే..



బుడగట్లపాలెంలో హార్బర్ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం నుంచి వలసలను పూర్తి స్థాయిలో నివారించవచ్చు. జిల్లాలో సుదూర సముద్ర తీర ప్రాంతం ఉన్నా ఒక్క జెట్టీ కూడా లేదు. గుజరాత్‌లో ప్రతి 25 కిలోమీటర్లకు ఒకటి వంతున జెట్టీని ఏర్పాటు చేయడంతోనే చేపల వేటకు అనుకూలంగా ఉంది. బుడగట్లపాలెంలో హార్బర్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి.

- అల్లుపల్లి రాంబాబు, సర్పంచ్, బుడగట్లపాలెం

గుజరాత్‌కే ఎందుకంటే

గుజరాత్‌లో 1,050 కిలోమీటర్ల సముద్రతీరం ఉంటే.. మన రాష్ట్రంలో 978 కిలోమీటర్ల తీరం ఉంది. రెండు రాష్ట్రాల్లోని సముద్ర తీరంలో పెద్దగా తేడా లేకపోయినా.. గుజరాత్‌కు ఈ ప్రాంత మత్స్యకారులు వలసపోవడానికి కారణాలను సంబంధిత అధికారుల బృందం అధ్యయనం చేసింది. గుజరాత్‌లో ప్రతి 20 నుంచి 25 కిలోమీటర్లకు తీరంలో జెట్టీలు, ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మించారు. ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేశారు. కోల్డ్‌స్టోరేజీ, హేచరీస్ తదితర వాటిని అధిక సంఖ్యలో నెలకొల్పారు. అక్కడ మత్స్య సంపద ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. దీంతో మన ప్రాంత మత్స్యకారులు గుజరాత్‌కు వెళ్తున్నారు. గుజరాత్‌లో సుమారు రూ.50 లక్షల విలువైన మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట సాగిస్తున్నారు. మన ప్రాంతంలో సంప్రదాయ తెప్పలు, ఫైబర్ తెప్పలు, మోటారైజ్డ్ బోట్లతో చేపల వేట చేపడుతున్నారు. దీనివల్ల వేటకు ఎక్కువ దూరం పోయేందుకు వీలుండదు. తెల్లవారుజామున నాలుగైదు గంటల సమయంలో చేపల వేటకు వెళితే మధ్యాహ్నం ఒంటి గంటకు ఒడ్డుకు చేరుతారు. దీంతో పెద్దగా చేపల వేట సాగడంలేదు. మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట లాభసాటిగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశగా..

మన రాష్ట్రంలో మత్స్యకారులకు ప్రయోజనాలు కల్పించేలా ఇప్పుడిప్పుడే చర్యలు మొదలయ్యాయి. జిల్లాలోని సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు నిర్మాణం వేగంగా జరుగుతోంది. బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, మంచినీళ్లపేటలో జెట్టీల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వీటి నిర్మాణాలు పూర్తయితే మత్స్యకారులకు స్థానికంగానే ఉపాధి లభించనుంది. కాగా పీఎంఎంఎస్‌వై పథకం కింద రాయితీపై సామగ్రిని అందజేస్తున్నా.. చేపల వేటకు అనుకూల పరిస్థితులు లేక వలసలు తప్పడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

గిరిజన ప్రగతికి బాటలు

(ఐదో పేజీ తరువాయి)

రూ.430.52 కోట్ల నిధులు విడుదల కానున్నాయి. పెద్దమడి పాఠశాలకు రూ.4.35 కోట్లు, వెన్నెలవలసకు రూ.4.36 కోట్లు, బొమ్మిక ఆశ్రమ పాఠశాలకు రూ.4.07 కోట్లు, సీతంపేట పాఠశాల అభివృద్ధికి రూ.4.88 కోట్లు కేటాయించనున్నారు.

- గిరిజన రైతులు దళారుల బారిన పడి నష్టపోకుండా పంట ఉత్పత్తులకు తగిన ధర దక్కేలా మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతగా సీతంపేటలో కోటి రూపాయలతో మార్కెట్ భవనాలు నిర్మించనున్నారు. రోజువారి అమ్మకాలు జరిగిన తరువాత మిగిలిన సరుకును గోదాములో నిల్వ చేసుకోవచ్చును. అధిక ధర వచ్చినప్పుడు వీటిని అమ్ముకోవచ్చునని, దీనివల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.
- గిరిజన గ్రామాల్లో ఎక్కువ మంది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి బారిన పడుతున్నారు. ఇలాంటి వారికి విశాఖ కేజీహెచ్‌లో ఆధునిక చికిత్స అందించనున్నారు. బాధితులను గుర్తించేందుకు ముందుగా గిరిజన గ్రామాల్లో సర్వే చేయనున్నారు. దీనికోసం రూ.3.55 కోట్లు మంజూరు చేయనున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి



కూటమి ప్రభుత్వంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్నాయి. ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించారు. ఇప్పుడు విద్య, వైద్య వంటి మౌలిక సౌకర్యాల కోసం నిధులు మంజూరు చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు. పైగా సబ్‌ప్లాన్ నిధులను మళ్లించారు.

- బైరిశింగి దినకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ, మెళియాపుట్టి

నేడు శంబరలో సిరిమానోత్సవం

- మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం

సాలూరు రూరల్/మక్కువ/సాలూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర భక్తుల కల్పవల్లి, పార్వతీపురం మన్యం జిల్లాలోని శంబర పోలమాంబ సిరిమానోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ, రెవెన్యూ, పోలీసులు ప్రణాళిక సిద్ధం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ దిలీప్ కిరణ్ సోమవారం భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినటగ్టు ఈవో సూర్యనారాయణ తెలిపారు.

భక్తుల కోసం సౌకర్యాలు

భక్తులకు అందించడానికి తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నారు. వనంగుడి, చదురుగుడి, రామాలయం, అంగన్‌వాడీ కేంద్రం తదితర ప్రాంతాల్లో ఐదు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మూడు ఫీడర్ అంబులెన్స్‌లు, మూడు 108 వాహనాలను అందుబాటులో ఉంచారు. ఉచిత, రూ.20, రూ.100 దర్శనాలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. 40 వేల లడ్డూలు, పులిహోర ప్రసాదం సిద్ధం చేస్తున్నట్టు ఈవో చెప్పారు. సిరిమానోత్సవం సందర్భంగా మంగళవారం శంబరకు 100 బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ సా లూరు డిపో మేనేజర్ భా స్కరరెడ్డి తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాల, వనం గుడి సమీపంలో రెండు తాత్కాలిక బస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

సిరిమాను తిరిగేది ఇలా..

ఈ ఏడాది 36 అడుగుల సిరిమానును సిద్ధం చేశామని ఈవో చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. ఈ ఏడాది దీనిని జన్ని పేకాపు రామారావు అధిరోహించనున్నారు. అనంతరం ఘటాలు దక్షిణ దిక్కుగా, సిరిమాను తూర్పు దిక్కుగా వెళతాయి. గొల్లవీధి, కొత్తవీధి మీదుగా పెద్దమ్మ గుడి వద్దకు చేరుకుంటుంది. అక్కడి నుంచి వెనుదిరిగి నడివీధికి చేరుకొని ఆగిపోతుంది. అక్కడి నుంచి సిరిమానుపై నుంచి దించి పూజారిని భుజాలపై చదురుగుడికి తీసుకువెళతారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

మక్కువ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అమ్మవారి ఘటాలు ప్రధాన వీధిలోని గద్దె వద్దకు చేరుకున్నాయి. భక్తుల కోలాహలం, డప్పులు, మంగళ వాయిద్యాల మధ్య మహిషాసురుడు, పోతురాజు వేషధారణలు నిర్వహించారు. శంబరకు చెందిన రైతులు సోమవారం ఉపవాసం ఉండి.. గ్రామ పెద్దలంతా జన్ని వారి ఇంటికి వెళ్లి... వారిని పిలిచి ఏరోత్సవం నిర్వహించారు. రైతులు విత్తనాలను తమ ఇళ్లకు తీసుకొని వెళ్లారు.

3 నుంచి రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

- సీఎం చంద్రబాబునాయుడుకు ఆహ్వానం
- శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన ఆచార్యులు కేశవ గోస్వామిమహారాజు



మాట్లాడుతున్న కేశవ గోస్వామిమహారాజు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):బంటుపల్లి పంచాయతీ పరిధిలోని గోశాల, రాధాకృష్ణ మందిరం గోకులానంద ఆశ్రమంలో ఫిబ్రవరి మూడు నుంచి ఏడో తేదీ వరకూ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన ఆచార్యులు కేశవగోస్వామిమహారాజు తెలిపారు. సోమవారం గోశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిష్ఠోత్సవాలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆహ్వానించడంతో హాజరుకానున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్రానికి సంబంధించిన ప్రముఖులు, దేశ నలుమూలల నుంచి సాధువులు, వేలాది మంది భక్తులు రానున్నారని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, కూటమి నాయకులు లంక శ్యామలరావు, జగన్నాథం నాయుడు, పిన్నింటి భానూజినాయుడు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పన: ఎమ్మెల్యే శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువత కు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు రేయింబవళ్లు శ్రమి స్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల జిల్లాపార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వరల్డ్ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏపీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ అరాచకపాలన సాగించిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో, ఏఐలో దేశంలోనే నెంబర్‌వన్ నిలబెట్టేందుకు సీఎం కష్టపడుతున్నా రన్నారు. సీఎం చంద్రబాబు, లోకేష్‌కు పారిశ్రామిక వేత్తలు ఎర్రతివాచీ పరిచారని తెలిపారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

కవిటి, జనవరి27(ఆంధ్రజ్యోతి): అన్నివిధాలుగా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకుపోతోందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ సోమవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో పారిశ్రామికరంగం నాశనమయ్యిందని విమర్శించారు. రాష్ట్రంలో పారిశ్రామికరంగం బలోపేతానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రమిస్తున్నారని తెలిపారు. యువతకు అవకాశాలు కల్పించేందుకు పాటుపడుతుంటే వైసీపీనేతలు లేనిపోని మాటలు ఆడుతున్నారని పేర్కొన్నారు.

వైసీపీ నాయకులు తీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్

ఆమదాలవలస, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తీరు మార్చుకోకపోతే ప్రజలు బుద్ధిచెబుతారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆమదాలవలసలో టీడీపీ న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, నూకరాజు ఎస్.మురళీధరరావు, తంగి గురయ్య విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రపంచంలో ప్రత్యేక స్థానం సాధించిన సీఎం నారా చంద్రబాబు నాయుడును విమర్శించడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బోరగోవిందరావు, సనపల డిల్లీశ్వరరావు, కాగితాపల్లి సంజీవరావు పాల్గొన్నారు.







అర్జీల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్: అర్జీదారులతో మాట్లాడుతున్న స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్‌తో కలిసి ప్రజా ఫిర్యాదుల వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 112 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంక టేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈవో వి.శ్రీధర్ రాజు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఫలితాలు వెల్లడించడం నేరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లల జననాలు తక్కువగా ఉన్న సరుబుజ్జిలి, బూర్జ, ఆముదాలవలస, హిరమండలం, సంతబొమ్మాళి మండలాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో బాల మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 114 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా ప్రభుత్వాసుపత్రుల్లో ఏర్పాటు చేసిన పది స్కానింగ్ కేంద్రాలు మినహా అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో రిటైర్డు న్యాయాధికారి పప్పల జగన్నాథరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ టి.శ్రీకాంత్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, కమిటీ సభ్యులు రాజేష్‌కుమార్ ప్రధాన్, వైద్యులు స్వర్ణలత, విద్యాసాగర్, , డిపిఎంవో బి.రవీంద్ర, డెమో వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదిక మీకోసంలో 54 ఫిర్యాదు అందాయి. ఈసందర్భంగా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదులకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రాధాన్యతనివ్వాలని జూమ్ మీటింగ్‌లో ఎస్పీ కోరారు.

ప్రజల గుండెల్లో ఎన్టీఆర్: విప్ అశోక్



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్

ఇచ్ఛాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవ స్థాపకుడు దివంగత నందమూరితారకరామారావు తెలు గుప్రజల గుండెల్లో చిరస్థాయి గా నిలిచిపోయారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం సన్యాసిపుట్టుగలో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి, కూటమి నాయకులు డిల్లీరావు, పద్మనాభం, చంద్రశేఖర్,కామేష్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే పనిలో లోకేష్

అరసవల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉన్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళంలోని 80అడుగుల రోడ్డులోగల టీడీపీ కార్యాలయంలో లోకేష్ యువగళంపాదయాత్ర రెండేళ్ల పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, పీఎంజే బాబు, మాదారపు వెంకటేష్, జగదీష్, రమణ, రమణయ్య పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

సోంపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి):ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ వినియోగించడంపై సోమవారం బారువ పోలీసులు అవగాహన కల్పించారు.ఈ మేరకు బారువ నుంచి కొర్లాం వరకు ర్యాలీ నిర్వహించారు. బారువ ఎస్‌ఐ ఐ.హరిబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మహిళలు పాల్గొన్నారు.

రాములుకు అంబేడ్కర్ సేవా రత్న అవార్డు

ఆమదాలవలస, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఏడో వార్డు చింతాడకు చెందిన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ డైరెకర్ తోట రాములుకు చేయూత సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా రత్న అవార్డుకు ఎంపిక చేసింది. సోమవారం విశాఖలో సన్మానించారు. అవార్డు లభించడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ రాములుకు అభినందించారు.

సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలైనా ఇప్పించండి

ఎచ్చెర్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చదువు పూర్తయిన విద్యార్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు వీలుగా కనీసం సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలైనా ఇప్పించాలని పూలే టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకుడు బొడ్డేపల్లి భూపతిరావు కోరారు. డిప్లమో, ఇంజనీరింగ్ తదితర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో సంబంధం లేకుండా సర్టిఫికెట్లను ఇప్పిస్తే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. క్యాంపస్ నుంచి ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌కు అగ్నిమాపకశాఖ అనుమతుల రద్దు

శ్రీకాకుళం క్రైం,జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో ఈనెల 25న అగ్ని ప్రమాదం నేపథ్యంలో ఆ భవనానికి తీసుకున్న అగ్నిమాపకశాఖ అనుమతులను రద్దు చేస్తూ ఆశాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం రాత్రి జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావు, ఏడీఎఫ్‌ఓ వరప్రసాద్‌లు షాపింగ్ మాల్ మేనేజర్ సురేష్‌కు నోటీసులు అందజేశారు. డీఎఫ్‌వో మోహన్‌రావు మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో జరిగిన ప్రమాదాన్ని నివారించడానికి భవనంలో నిర్మాణలోపాలు అడ్డంగా మారాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. దీంతో ఆ షాపింగ్ మాల్ భవనానికి పి.యశోద పేరు మీద తీసుకున్న ఎన్‌వోసీని రద్దు చేశామన్నారు. శ్రీకాకుళంతో పాటు జిల్లాలో ఇటువంటి భవనాలు అంచనా వేసి నివేదిక ఇవ్వాలని స్టేషన్ అధికారులకు ఆదేశించామని, అటువంటి భవనాలపై చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌ఓ మోహన్‌రావు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

శ్రీకాకుళం క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే నేరాలు, అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రూరల్ ఎస్‌ఐ కె.రాముసూచించారు. సోమవారం పెద్దపాడులోని పోలీసు స్టేషన్‌లో సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటుచేశారు.

పట్టుశాలి సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

పొందూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి):పట్టుశాలి సంక్షేమ సంఘం మండలకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పొందూరులో పట్టుశాలి సామాజికవర్గ పెద్దల సమక్షంలో జరిగిన ఎ న్నికల్లో అధ్యక్షుడిగా పూంద్రు రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా పాలిశెట్టి సూర్యం, ఉపాధ్యక్షుడిగా కోరుకొండ రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా మాడుగుల రామకృష్ణ, కోశాధికారిగా బండారు గణేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్‌రామ్మోహన్, పార్టీ పట్టణాధ్యక్షుడు ఎ. చినరంగ, ఎంపీటీసీ బి. గిరి అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

గుజరాతీపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సిరిపురం తేజేశ్వరరావు ఆ పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ,చల్లా వెంకటేశ్వరరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, చింతపల్లి దుర్గారావు గాంధీ, బైపల్లి రాజేశ్వరి, రుప్ప బాలకృష్ణ ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

అరసవల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసే కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షురాలు పి.పవిత్ర డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులనుఒత్తిడికి గురి చేయడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు చిన్నారావు, కార్యదర్శి ఖగేష్, హేమంత్, రాహుల్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్‌లో శ్రీకాకుళం క్రీడాకారుడికి కాంస్య పతకం



కాంస్య పతకంతో సతివాడ హిమసాయిశేఖర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన సతివాడ హిమసాయి శేఖర్ అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్‌లో సత్తాచాటాడు. ఈజిప్ట్‌లోని కైరోలో ఈనెల 21 నుంచి 26వ వరకు జరిగిన బీడబ్ల్యుఎఫ్ పారా బ్యాడ్మింటన్ వరల్డ్ సర్క్యూట్ పోటీల్లో కాంస్యపతకం సాధించాడు. హిమసాయి శేఖర్ భారత్ తరఫునపాల్గొని పతకాన్ని సాధించడంపై తండ్రి రమణయ్య ఆనందాన్ని వ్యక్తం చేశారు. బాల్య దశలోనే విద్యుత్ ప్రమాదంలో కుడి చేతిన కోల్పోయాడు. బ్యాడ్మింటన్‌పై మక్కువతో కఠోరసాధన చేసి రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శనతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు.హిమసాయి క్యాంసపతకం లభించడంతో జిల్లా క్రీడాభివృద్ధి కె.శ్రీధర్, జిల్లాఒలింపిక్‌సంఘం సీఈవో పి.సుందరరావు, కార్య దర్శి ఎం.సాంబమూర్తి,పీఈటీ, వీడీ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ రమణ, పూర్వ డీఎస్‌డీవో దేవానందం హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా క్రీడాకారుడు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పలాసకు చెందిన కోగాన ప్రవీణ్ ఉత్తరాఖండ్‌లోని హలద్వాలో బుధవారం నుంచి ఫిబ్రవరి మూడోతేదీ వరకూ జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ప్రవీణ్ సోమవారం బయలుదేరినట్లు జిల్లా ఖోఖో అధ్యక్షుడు చిట్టి నాగభూషణం, కార్యదర్శి చిట్టి ఫల్గుణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాధు శ్రీనివాసరావు తెలిపారు. ప్రవీణ్‌కు అరుదైన అవకాశం రావడం పట్ల ఆ సంఘం చైర్మన్ పొన్నాడ రవికుమార్, కె.శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అభినందించారు.

వేతన బకాయిలు చెల్లించాలి

అరసవల్లి,జనవరి 27(ఆంధ్రజ్యోతి):తమ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని వీవోఏలసంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సీహెచ్‌అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని జ్యోతిబాపూలేపార్క్ వద్ద వీఏవోలు దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, వీఆర్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, సం ఘం నాయకులు జోగారావు, ఎర్రయ్య, అనూరాధ, మన్మథ రావు, రాజేశ్వరి, లక్ష్మి, మహాలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎచ్చెర్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి):పశువులకు సీజన్‌ల వారీగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అదనపు సంచాలకుడు ఎండ సింహాచలం కోరారు. సోమవారం తోటపాలెం, బొంతలకోడూరుల్లో నిర్వహించిన పశు వైద్యశిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించే శిబిరాల్లో పశువులు, గొర్రెలు అవసరమైన చికిత్స చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఆనందరావు, పశు వైద్యాధికారి జి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

- జి.సిగడాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెంట, సంతవు రిటిలో సోమవారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్, వైద్య సిబ్బంది తమ్మినేని మంగవేణి, మాదవీ కల్పన, రంగ, ప్రసాద్, రాందాస్, నాయకులు మీసాల రమణ, పి అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, మక్క కూర్మినాయుడు, వివిగోపాలరావు పాత్రో పాల్గొన్నారు.
- బూర్జ,జనవరి 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని అప్పలపేటలో డాక్టర్ ఎం.జ్యోత్స్న ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులకు ట్యాగింగ్ చేయించుకొని గాలికుంటు టీకాలు వేయించాలని తెలిపారు.

నేడు మండల సమావేశం

జి.సిగడాం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుంటముక్కలు రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాని కోరారు.

నేటి నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా

ఆమదాలవలస, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో మంగళవారం నుంచి ఈనెల 31 వరకు రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా చేయనున్నట్లు కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తెలిపారు. పురపాలక సంఘానికి నీటి సరఫ రాచేసే వంశధారనదిలోని అలమాజీపేట హెడ్ వాటర్‌వర్క్స్‌లో ఇసుకమేటలు ఏర్ప డ్డాయని పేర్కొన్నారు. దీంతో బావులకు నీరందకపోవడం వల్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను వినియోగించుకోండి

గుజరాతీపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి):న్యాయసహాయంపొందాలనుకునే వారు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కోరారు.సోమవారం స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలో గలలీగల్ సర్వీస్ ఆథారిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు కె.ఆఫీస్‌నాయుడు, పుట్టా అంజనీకుమార్ హర్షవర్ధన్, జి.ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

సోంపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రోటరీ ప్రతినిధులు కోల్‌ఇండియా సహకారంతో 15మంది మహిళలకు లక్ష రూపాయలు విలువచేసే కుట్టుమిషన్లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు, రోటరీ క్లబ్ ఇమేజ్ జిల్లా చైర్మన్ శ్రీనివాస రావు, రోటరీ అధ్యక్షుడు జుత్తు చలపతిరావు, టంకాల బాబు, రవికుమార్ పాల్గొన్నారు.

మదనాపురంలో బోరు ఏర్పాటు

బూర్జ,జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో ఉన్న మదనాపురంలో హ్యాండ్‌బోరు ఏర్పాటు చేశారు. మదనాపురం పొలిమేరలో ఉన్న తాగునీటి బావిలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో నీరు పాడైంది. దీంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈనేపథ్యంలో టీడీపీ నాయకుడు ఆనెపు రామకృష్ణనాయుడు ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి హ్యాండ్‌బోరు ఏర్పాటు చేశారు.

ఉపాధి పనుల ప్రారంభం

కవిటి, జనవరి27(ఆంధ్రజ్యోతి): పెద్ద మెళియాపుట్టుగలో సోమవారం ఉపాధి హామీపథకం పనులకు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.రమేష్, నాయకులు ఎ.మధు, వి.రంగారావు, బి.సురేష్, బి.గిరిబాబు పాల్గొన్నారు

157 మందికి కంటిపరీక్షలు

కవిటి, జనవరి27(ఆంధ్రజ్యోతి): కరాపాడు టోల్‌ప్లాజా వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో సోంపేటలోని ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి వైద్యులు డ్రైవర్లు, టోల్‌సిబ్బందికి కంటిపరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 157 మందికి వివిధ పరీక్షలుచేసి కం టిచుక్కలు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

వంజంగి సర్పంచ్ మృతి

ఆమదాలవలస,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ బెండి గోవిందరావు సతీమణి, వంజంగి సర్పంచ్ సత్యవతి సోమవారం మృతిచెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే కూనరవికుమార్, టీడీపీ, బీజేపీ వైసీపీ, జనసేన నాయ కులకు ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు.

పాఠశాల విలీనం చేయవద్దు

సోంపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట ఎంపీపీ పాఠశా లను గొనకపాడు హైస్కూల్‌లో విలీనం చేయవద్దని హుకుంపేట గ్రామస్థులు కోరారు. ఈమేరకు హెచ్‌ఎం ప్రభాకరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లుగా దాత ఇచ్చిన స్థలంలో పాఠశాల నడుస్తోందని, ఇప్పటికీ 43మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గొనకపాడు హైస్కూల్‌కు వెళ్లాలంటే జాతీయరహదారి దాటాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాలు


శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాలు మంగళవారం నుంచి ఈనెల 30 వరకు డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసినట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అలీమ్‌కో సంస్థ ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సీఎస్‌ఆర్ ఫండ్స్ సహకారంతో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో, బుధవారం టెక్కలి తహసీల్దారు కార్యాలయంలో, 30న పలాస ఎంపీడీఓ కార్యాలయంలో గుర్తింపు శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న హరికృష్ణ

అరసవల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారా యణ స్వామివారిని శ్రీకాకుళానికి చెందిన పొట్నూరు హరికృష్ణ కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యుడు పొట్నూరు గురునాథస్వామి జ్ఞాపకార్థం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,00,001లను ఆలయ సూపరింటెండెంట్ కనకరాజుకు అందజేశారు. ఆదిత్య ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి.శంకరశర్మ వేదమంత్రాలతో ఆశీర్వదించగా, సూపరింటెండెంట్ స్వామివారికి చిత్రపటాన్ని అందజేశారు.



కప్పేస్తున్న పొగ మంచు

- రోడ్డు కనిపించక ప్రమాదాలు
- అప్రమత్తంగా ఉంటేనే మంచిది
- రోడ్లపై రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలి

హరిపురం/టెక్కలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో పట్టణం, పల్లె అనే తేడా లేకుండా మంచుదుప్పటి కప్పేస్తోంది. రాత్రి 11 గంటల తరువాత ప్రారంభమై ఉదయం తొమ్మిది గంటలు దాటినా మంచు వీడడం లేదు. పొగ మంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల ప్రాణాలు సైతం పోయిన సందర్భాలున్నాయి. మంచువల్ల మార్గం కనిపించకపోవడం, రోడ్లపై రేడియం స్టి



టెక్కలి సమీపంలో పొగమంచు



హరిపురం: మఖరజోల వద్ద హైవేపై సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఇలా..

క్కర్లు లేకపోవడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, ప్రమాదకర మలుపులతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా పొగమంచు వల్ల రోడ్లు కనిపించక వాహనచోదకులు ఇక్కట్లకు గురయ్యారు. దగ్గరగా వచ్చే వరకు వాహనాలు కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రమా దాలను నివారించేందుకు రోడ్ల వెంట రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, మార్జిన్ తో పాటు రోడ్డు మధ్య, మలుపుల వద్ద రేడియం ఉండే కలర్ గీతలు వేయాలని కోరు తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని నిరోధించేందుకు పోలీసుల తనిఖీ ముమ్మరంగా చేపట్టాలని, రోడ్డు పక్క భారీ వాహనాలను నిలిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. పొగ మంచుతో అపరాల పంటలైన మినుము, పెసర, జీడి, మామిడి, తెట్టంగి, రాగులు, నువ్వులు తది తర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని పలువురు రైతులు వాపోతున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



నారాయణరావు

నందిగాం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గొల్లూరు గ్రామానికి చెందిన రెల్ల నారాయణరావు(41) అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నారాయణరావు ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అతని దగ్గర ఉన్న మొబైల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ అని రావడంతో భార్య ధనలక్ష్మి ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ట్రాక్టర్ టైర్ల కింద ఇరుక్కుపోయిన బైక్

జలుమూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చెన్నాయివలసకి చెందిన బొమ్మాళి రాము, భార్య లక్ష్మి చెన్నాయివలస నుంచి ద్విచక్రవాహనంపై చల్లవానిపేట వైపు వెళుతూ అదే దిశలో వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే సరికి ట్రాక్టర్ డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా ఒక్కసారిగా కుడివైపునకు తిరగడంతో ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక ట్రాక్టర్ కింద పడిపోయారు. దీంతో రాముతో పాటు భార్యకి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం హెచ్‌సీ రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా ట్రాక్టరు ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.

పొడుగుపాడు వద్ద ఒకరికి..

కోటబొమ్మాళి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పొడుగుపాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో బోరుమజ్జిపాలేనికి చెందిన కరుకోల శ్రీనివాస రావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈతడు శ్రీజగన్నాథపురం వైపు నుంచి రాంగ్‌రూట్‌లో కోట బొమ్మాళి వైపు వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌కు బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే క్షతగాత్రుడిని మొదట స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

27 పశువుల స్వాధీనం



పశువులను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న పోలీసులు

నరసన్నపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మడపాం టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై సోమవారం కోటబొమ్మాళి, టెక్కలి, జలుమూరు తదితర మండలాల నుంచి బుడుమూరు సంతకు తరలిస్తున్న 8 పశువుల వ్యాన్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా 27 పశువులను విక్రయించేందుకు తీసుకువెళు తుండగా వాటిని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. సంబంధిత వాహనాలు, యాజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు. పశువులకు ఉచితంగా గ్రాసం ఇచ్చేందుకు సమాజ సేవకుడు మార్పు విజయకుమార్ ముందుకు వచ్చారు.

ఆలయంలో చోరీ చేస్తుండగా పట్టివేత

మెళియాపుట్టి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోపీనాథపురం గ్రామంలోని ముత్యాల పోలమ్మ గుడిలో ఉన్న హుండీని ఇనుప రాడ్డుతో కొడుతున్న వ్యక్తిని గ్రామస్థులు పట్టుకుని సోమవారం పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. నిందితుడిని విచారించగా సారవ కోట మండలం మదనాపురానికి చెందిన పోలుమహంతి ప్రసాద్‌గా గుర్తించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టిడ్కో గృహాలను కేటాయించాలి

పలాస, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని పట్టణానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు మునిసిపల్ కార్యాలయంలో 'మీకోసం'లో కమిషనర్ రామారావుకు వినతిపత్రాలు అందించారు. గృహాల కోసం డబ్బులు చెల్లించినా ఇంతవరకు అప్పగించక పోవడంతో బ్యాంకర్ల నుంచి ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయన్నారు. వడ్డీ, అసలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. ప్రభుత్వం దీనికి సంబంధించిన మార్గదర్శకాలు ఇస్తుందని, తగు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రీవెన్స్‌లో 12 దర ఖాస్తులు రాగా అందులో మరణ ధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల కోసం దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించండి

పలాసరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఉపాధి పనులు జరగడం లేదని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు గ్రామస్థులతో కలిసి కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో వసంత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి పనులు జరిగే చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

'మీకోసం'కు అధికారుల డుమ్మా

టెక్కలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'మీకోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదికకు డివిజనల్ స్థాయి అధికారులు డుమ్మా కొడుతు న్నారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఉదయం 10.30 గంటలకు హాజరైతే పలువురు డివిజన్ స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా డుమ్మా కొట్టడంపై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం కూడా పలు శాఖల అధికారులు రాగా హౌసింగ్, పంచాయతీరాజ్ ఈఈలు, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఏటీడబ్ల్యూవో, సీడీపీవో, ఈపీడీసీఎల్ డీఈఈ, సహాయ బీసీ తరగతుల సంక్షేమాధికారి, మత్స్యశాఖ ఏడీ, జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ గైర్హాజరు కాగా మిగిలిన శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని పంపి మమ అనిపించారు. ప్రతి సోమవారం ఇదే తంతు కొనసాగడంపై ఆర్డీవో అసహనం వ్యక్తం చేశారు. తక్షణం షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సిబ్బందికి సూచించారు. తాను సమయపాలన కొనసాగిస్తుంటే డివిజన్ స్థాయి అధికారులు ఎందుకు పాటించడం లేదని ఆయన ప్రశ్నించారు.

ప్రత్యేక బృందంతో దివ్యాంగులకు తనిఖీ

నరసన్నపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో సోమవారం సదరం శిబిరాన్ని నిర్వ హించారు. 50 మందికి మొదటిరోజు స్లాట్ కేటాయించగా 30 మంది హాజరయ్యారు. వీరిలో కొందరు సకాంగులే సర్టిఫికేట్లు పొందినట్లు, మరికొందరికి ఎక్కువ అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు వైద్య బృందం గుర్తిం చింది.

నీటి సంఘం అధ్యక్షుల బాధ్యతల స్వీకరణ

సంతబొమ్మాళి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మేఘవరం నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బుడ్డెపు ఢిల్లేశ్వరావు, మేరుగు నూకయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వంశధార డీఈఈ శ్రీహరి విధి విధాన పత్రాలను అందజేశారు. సూరాడ ధన రాజ్, శ్రీరంగం రాజులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఒకేలా రుసుం

- కంగుతింటున్న వాహనదారులు
- ఇదీ మడపాం టోల్‌ప్లాజా వద్ద పరిస్థితి

టెక్కలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఏదైనా ఒక వాహనం 24 గంటల్లో రాకపోకలు కొనసాగిస్తే ఒకవైపు ఫుల్ చార్జి, మరోవైపు 45 శాతం చార్జీ ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా టోల్ రుసుం వసూలు చేయాల్సి ఉంది. అయితే మడపాం వద్ద ఉన్న టోల్‌ప్లాజాలో 24గంటల్లో వాహనాల రాకపోక లకు ఒకేలా చార్జీలు వసూలు చేస్తుండడంతో వాహన యజమానులు కంగు తింటున్నారు. ఈ టోల్‌గేట్ నుంచి రోజుకి సుమారు ఎనిమిది వేల నుంచి తొమ్మిది వేల వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. అయితే 24 గంటల్లో రాకపోకలు సాగించే వాహనాలు నాలుగువేల నుంచి ఐదువేల మధ్య ఉంటాయి. ఆయా వాహనాలను బట్టి రుసుం వసూలు చేస్తారు. అయితే ఇరువైపులా ఒకేలా రుసుం వసూలు చేస్తుండడంతో తమపై అదనపు భారం పడుతోందని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈనెల 24 నుంచి సోమవారం ఉదయం వరకు మూడురోజుల పాటు ఇదే పరిస్థితి నెలకొంది. టోల్‌గేట్ మేనేజర్ వై.లక్ష్మణ రావును వాహన యజమానులు ప్రశ్నించగా ఐడీఎఫ్‌సీ బ్యాంక్ పోర్టల్ నుంచి ఎస్‌బీఐ పోర్టల్ లోకి మెర్జ్ చేయడం వల్ల ఈ సమస్య తలెత్తిందని, టోల్‌ప్లాజాలో టైం, డేటా ఇంకా మెర్జ్ అవ్వా ల్సి ఉందని, అదనంగా వసూలు చేసినవి ఆయా ఫాస్ట్‌ట్యాగ్ బ్యాంకు ఖాతాల్లోకి రిఫండ్ జమవుతాయన్నారు. శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు కావడంతో జాప్యం నెలకొందన్నారు.



మడపాం టోల్‌ప్లాజా, ఇన్‌సెట్‌లో రాక, పోకల్లో ఒకేలా టోల్ ఫీజు కట్ అయిన దృశ్యం

నిరుద్యోగులకు ఆశాదీపం చంద్రబాబు: బగ్గు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

నరసన్నపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపే ఆశాదీపం సీఎం చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్టుబడిదారులు పరిశ్రమలు ఏర్పాటుకు వస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు బహుళజాతి కంపెనీలు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, నేతలు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, బైరి భాస్కరరావు, బలగ భారతి పాల్గొన్నారు.

దావోస్ పర్యటన విజయవంతం: ఎంజీఆర్

పాతపట్నం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దావోస్ పర్యటన విజయవంతమైందని, తండ్రీ తనయుల అసమాన ప్రతిభతో అనేక పరిశ్రమలు, సంస్థలు రాష్ట్రానికి రానున్నాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకాకర్షణగా నిలిచిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో సీఎం, ఐటీశాఖ మంత్రి కృషి చేశారన్నారు.

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టి యువగళం పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లయిన సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బాబ్జీ, సలాడ సతీష్, మంచు కృష్ణారావు, శివాల చిన్నయ్య, కలమట భుజం గరావు, అక్కంద్ర సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితో పరిశ్రమలు: శిరీష

పలాస, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ముందుచూపు, మంత్రి లోకేశ్ కృషి ఫలితంగా రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు పెట్టుబడిదారులు వస్తున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పరిశ్ర మలతో నూతన వెలుగులు తీసుకు వచ్చేందుకు కృషిచేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు దావోస్ వెళ్లి 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన పరిశ్రమలు, సంస్థలను రాష్ట్రానికి తీసుకు రావడం హర్షణీయ మన్నారు. ఒక్క రాష్ట్రానికి రూ. 1.46 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకు రావడం చరిత్రలో మిగిలిపోతుందన్నారు.



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గౌతు శిరీష

స్టడీ మెటీరియల్ పంపిణీ

వజ్రపుకొత్తూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): డోకులపాడు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యం స్నేహ కళామండలి సాయంతో పరీక్ష మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వరలక్ష్మి, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, మోహనరావు, రమేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంలో నూతన వెలుగులు

టెక్కలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు దావోస్ పర్యటన వల్ల రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో నూతన వెలుగులు విరజిమ్మనున్నాయని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు రామకృష్ణ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. సమావేశంలో నేతలు మామిడి రాము, కోళ్ల లవకుమార్, రెయ్యి ప్రీతీష్, ప్రసాద్‌రెడ్డి, ప్రఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8న జాతీయ లోక్‌అదాలత్

సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు



టెక్కలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సముదాయాల పరిధిలో ఫిబ్రవరి 8న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. రాజీయే రాజమార్గమని, లోక్ అదాలత్ తీర్పే అంతిమమన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

పోలాకి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి దాతలు మరింత తోడ్పడాలని సుసరాం సర్పంచ్ దుంపల ఆనందరావు అన్నారు. సుసరాం ఉన్నత పాఠశాల విద్యార్థులకు సత్యసాయి మండలి సభ్యులు అందించిన రడీమేడ్ దుస్తులు, వెలమూరి ఫౌండేషన్ అండ్ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధులు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో మండలి కన్వీనర్ బరాటం రామారావు, సంస్థ పీఆర్వో పొట్నూరు ప్రసాదరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈజిప్ట్ పోటీల్లో పూర్ణారావు ప్రతిభ



టెక్కలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈజిప్ట్‌లో ఈనెల 21 నుంచి 26 వరకు జరిగిన అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన చాపర పూర్ణారావు ప్రతిభ కనబరిచాడు. రెండు బంగారు, ఒక కాంస్య పత కం సాధించి రాష్ట్ర ఖ్యాతిని చాటా రు. ఎనిమిదేళ్ల కిందట పూర్ణారావు ద్విచక్ర వాహనం నడు పుతూ డివైడర్‌ను ఢీకొనడంతో కాళ్లు పోగొట్టుకొని వీల్‌ఛైర్‌కు పరిమితమయ్యాడు. దివ్యాంగుడినని కుంగిపోకుండా అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. పూర్ణారావును తల్లిదండ్రులు అభినందించారు.

హెల్మెట్ ధరించాల్సిందే..

కొత్తూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని నోహెల్మెట్, నో డ్రైవింగ్ అని ఎస్ఐ ఎండీ అమీర్‌ఆలీ అన్నారు. కొత్తూరు నాలుగు రోడ్ల జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేపట్టారు. హెల్మెట్, వాహన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు హెల్మెట్ లేని ప్రయాణం వల్ల ప్రమాదాలు జరిగి మృత్యువాత పడే అవకాశా లున్నాయన్నారు. హెల్మెట్ రక్షణ కవచమన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఫిబ్రవరిలో పాల పోటీలు

కోటబొమ్మాళి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలోని పాడి పశువుల ఉత్తరాంధ్ర స్థాయి పాల పోటీలు ఫిబ్రవరి చివరి వారంలో నిర్వ హిస్తున్నట్లు పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లా డుతూ.. ఈ పోటీలు విజయనగరం జిల్లా తోటపాలేంలో జరుగుతాయని, పాలిచ్చే పశువులను తీసుకువెళ్లాలని, అక్కడ మూడురోజులు ఉండాల్సి ఉంటుందన్నారు. పశువులకు రవాణా, వసతి, దాణా, నీటి సౌకర్యంతో పాటు రవాణా సమయంలో బీమా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న పాడి రైతులు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సమయ పాలన తప్పనిసరి

నరసన్నపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.శ్రీకాంత్ సూచించారు. సోమవారం మాకివలస పీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్న ఎల్‌సీడీసీ సర్వే తీరుపై సమీక్షించారు. క్షయ నివారణలో భాగంగా ప్రతీ ఉప ఆరోగ్యకేంద్రం నుంచి 10 కెళ్లె పరీక్ష నమూనాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నరసన్నపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు పాటించాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. సోమవారం నియోజవర్గంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. వివిధ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేయాలన్నారు. ఆదాయపు పన్ను పత్రాలను ఇవ్వాలని, సెలవుల్లో పాఠశాలలు తీయరాదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

మెళియాపుట్టి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన బి.బాలకృష్ణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గ్రామస్థులు విరాళాలు వేసుకుని రూ.20 వేలు అందజేసినట్లు టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు భూర్లె లలితమ్మ తెలిపారు. పేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఆదుకోవాలన్న ఉద్దేశంతో ఈ మొత్తం అందించామనారు. కలవయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

వజ్రపుకొత్తూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలును వెంటనే చేపట్టాలని సీపీఎం నాయకుడు ఎన్.మోహనరావు, డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక వ్యయప్రయాసలకు ఎదుర్కొని పంట పండిస్తే ఆ పంట నేలపాలవుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.భాస్కరావు, ఎన్.చంద్రయ్య, బి.రామకృష్ణ, నీలాచలం పాల్గొన్నారు. ● గోవిందపురం ఎర్రబంద చెరువుకు వెళ్లేందుకు దారిని చూపించాలని రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. పూర్వం నుంచి రైతులు నడిచే దారి ఆక్రమణకు గురైందన్నారు. కార్యక్రమంలో కేశవరావు, బద్రి చిన్నారావు, సవరయ్య, మృత్యుంజయరావు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

జలుమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకోవాలని చెన్నాయివలస, యలమంచిలి స్వదేశీ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి సోమవారం వినతిపత్రం అందించారు. మా సంఘాలకు రాయితీలు వర్తింపజేసి ఆదుకోవాలని వారు కోరారు. చేపలు నిలువ ఉంచేందుకు ఐస్ బాక్సులు, ద్విచక్రవాహనాలు, వలలు, ఆటో రిక్షాలు రాయితీపై ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు డి.గురునాథరావు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

- జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో యోగాసనాలు

రథసప్తమి నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు సూర్యనమస్కారాలపై అవగాహనకు గాను సోమవారం వివిధ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో సూర్యనమస్కారాలు వేయించి వాటి విశిష్టతను వివరించారు. సూర్య నమస్కారాలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



సంతబొమ్మాళి: దండుగోపాలపురం ఉన్నత పాఠశాలలో..



టెక్కలి: జడ్పీ ఉన్నత పాఠశాలలో..



నందిగాం: రౌతుపురం పాఠశాలలో..



పాతపట్నం: యోగాసాధన చేస్తున్న అధికారులు



పోలాకి: ఈదులవలస మోడల్ పాఠశాలలో..



జలుమూరు: అల్లాడ ఉన్నత పాఠశాలలో..



ఇచ్ఛాపురం: ధర్మపురంలో..



కొత్తూరు: జూనియర్ కళాశాలలో..



కవిటి: జూనియర్ కళాశాలలో..